క్లుప్తంగా

చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ


బహుమతులు స్వీకరిస్తున్న విద్యార్థులు

యలమంచిలి: గాంధీ జయంతి సందర్భంగా సర్వోదయ మండలి జిల్లా స్థాయిలో ఆన్‌లైన్ విధానంలో నిర్వహించిన చిత్రలేకనం పోటీల్లో మేడపాడు హైస్కూల్ విద్యార్థులు ఆకుమర్తి శ్రీ వర్షిణి, బోనం యామినిలు బెస్ట్ వన్ ప్రైజ్‌లు సాధించారని ప్రధానోపాధ్యాయులు ఎంవీ సత్యనారాయణ తెలిపారు. భీమవరం కస్తూర్బా భవనంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు అందుకున్నారని పేర్కొన్నారు. విజేతలను, వారికి శిక్షణ ఇచ్చిన చిత్రలేకన ఉపాధ్యాయుడు అడ్డాల శివ రామకృష్ణంరాజును ఆయన అభినందించారు.

సీనియర్ సిటిజన్స్‌కు సన్మానం


సీనియర్ సిటిజన్స్‌ను సన్మానిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: సీనియర్ సిటిజన్స్ డే సందర్భంగా స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 65 సంవత్సరాలు నిండిన వారిని బుధవారం పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ ఫంక్షన్ హాలులో సన్మానించారు. ఆకి రామకృష్ణ, కేవీ నరసింహం, గాదె జనార్ధన్ గుప్తా, మద్దుల సుబ్రహ్మణ్యేశ్వరరావు, మాగం బాలకొండలరావు, మోహతాజీ గుప్తా, మాటూరి నరసింహమూర్తి, తెలనాకుల సూర్యనారాయణ, పి.సత్య ప్రతాప్‌రాజు, ద్వారా ప్రభాకరరావు, మాటూరి కేశవ గుప్త, రాపాక నాగ శ్రీరామారావు తదితరులను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు శిడగం సతీష్, శ్రీఖాకొల్లు కామేశ్వరరావు, ముచ్చర్ల వెంకట సత్యనారాయణ, కె జయభారత్‌రెడ్డి, కడిమి పెదబాబు పాల్గొన్నారు.

హాస్యనటుడు అల్లుకు నివాళి


అల్లు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో నాటక రంగం నుంచి స్వయంకృషితో ఎదిగి సినీ రంగానికి చేరుకుని పాలకొల్లు కీర్తి ప్రతిష్టలను నలుదిశలా వ్యాపింపచేసిన ఘనత సినీ నటుడు, పద్మశ్రీ అల్లు రామలింగయ్యదేనని రాష్ట్ర చిరు పాన్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తులా రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం అల్లు రామలింగయ్య 103వ జయంతి సందర్భంగా స్థానిక చిన్నకార్ల స్టాండ్ వద్ద ఉన్న కాంశ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అల్లు రాధాకృష్ణ, కొమ్ముల దినేష్, మద్దాల గణేష్, ముచ్చర్ల రమేష్, కోట్ల నవీన్, అలుగు సత్తిబాబు, పోకల సాయి, లంకా సాయి, పోకల శివ, మత్తే వెంకటేష్ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా బుధవారం సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో పేదలైన వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, అన్నదానం చేశారు. అఖిల భారత సీనియర్ సిటిజన్ సంక్షేమ సంఘం జాయింట్ సెక్రటరీ వీకే వీరారావు, జిల్లా అధ్యక్షుడు ఎ.ఎస్.ఎస్ సత్యనారాయణలు మాట్లాడుతూ వృద్ధులకు రాజ్యాంగపరంగా కల్పించిన హక్కులు, రక్షణ, వృద్ధులకు కుటుంబ సభ్యులు వల్ల, ఇతరుల వల్ల ఇబ్బందులు కలిగినప్పుడు చట్టపరంగా అందే సహాయం తదితర అంశాలను ప్రస్తావించారు. తాలూకా యూనిట్ అధ్యక్షుడు కె.బాలకృష్ణ, కార్యదర్శి ఎ.జనార్ధనరావు, బి.హరికుమార్, వైవీఎస్ మూర్తి పాల్గొన్నారు.

మహిషాసురమర్ధనీ నమోనమః


పెనుగొండ : మహిషాసురమర్దని


పాలకొల్లు సెంట్రల్: కనకదుర్గమ్మ ఆలయంలో..


నరసాపురం రూరల్ : పుంతలో ముసలమ్మ


నరసాపురం రూరల్ : చినమైనవానిలంకలో..


పాలకొల్లు సెంట్రల్: క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో..


యలమంచిలి : ఏనుగువానిలంక కనకదుర్గమ్మ


పెనుగొండ : వాసవీ మాత


నరసాపురం: రాజరాజేశ్వరీదేవికి పూజలు

- భక్తిశ్రద్ధలతో అమ్మవార్లకు పూజలు
- కిటకిటలాడిన ఆలయాలు

పెనుగొండ: శరన్నవరాత్రులు సందర్భంగా బుధవారం అమ్మవార్లు మహిషాసురమర్దని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెనుగొండలోని మూలవిరాట్ వాసవీ మాత కొలువై ఉన్న నగరేశ్వర మహిషాసురమర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో మహిషాసురమర్దని ఉగ్రరూపంలోనూ, వాసవీ మాత మహిషాసుమర్దని అలంకారంలో దర్శనమిచ్చారు. అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాంలోనూ మరకత శిల వాసవీ మాతను మహిషాసురమర్దనిగా అలంకరించారు. ఉదయం నుంచి ఆలయాల్లో పూజలు, అభిషేకంలు నిర్వహించారు. పెదమల్లం మాచేనమ్మ, సిద్ధాంతంలోని అమ్మవార్లకు పూజలు చేశారు.

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని మహిషాసురమర్దనిగా అలంకరించారు. లక్ష కుంకుమార్చనలు చేశారు. రాత్రి 8.30 గంటల సమయంలో అమ్మవారికి కుంభం వేశారు. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో అమ్మవారు మహంకాళీదేవిగా దర్శనమిచ్చారు. యడ్లబజారు సెంటర్‌లో కనక దుర్గమ్మకు లక్ష కుంకుమ పూజలు, అష్టోత్తర పూజలు చేశారు.


పాలకొల్లు సెంట్రల్: మహంకాళీదేవి

నరసాపురం: పట్టణంలోని వివిధ ప్రధాన కూడళ్లలోని మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పండ్ల మార్కెట్ వద్ద అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మాజీ సర్పంచ్ చల్లా సత్యనారాయణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో పూజలు చేశారు.

నరసాపురం రూరల్ : మండలంలోని చినమైనవానిలంక గ్రామంలో కనక దుర్గమ్మను 100, 200, 500 రూపాయల కరెన్సీ నోట్ల రూ.2 లక్షలతో ధనలక్ష్మిగా అలంకరించారు. లింగనబోయిన చర్ల గ్రామం పుంతలో ముసలమ్మ మహిషాసురమర్దనిగా దర్శనమిచ్చారు. కుంకుమ పూజలు చేశారు.

యలమంచిలి: ఏనుగువానిలంక శెట్టిబలిజపాలెంలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయం వద్ద ఉత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి జాతర, కోలాటం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. తంగెళ్ల నాగేంద్ర పర్యవేక్షణలో యువతలు, మహిళలు కోలాట భజన చేశారు. అమ్మవారిని మంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఎంపీపీ ఇనుకొండ ధనలక్ష్మి రవికుమార్ దంపతులు దర్శించుకున్నారు.

రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక పాలన


డిజిటల్ యాప్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గోపి

వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గోపి

పాలకొల్లు సెంట్రల్: రాష్ట్రంలో ప్రజామోద్యమైన పరిపాలన జరగడంలేదని కూటమి నాయకుల రెడ్‌బుక్ రాజ్యాంగమే నడుస్తోందని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పార్టీ డిజిటల్ బుక్ యాప్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ రాష్ట్రంలో దుష్ట సాంప్రదాయం నడుస్తోందన్నారు. ప్రశ్నించే గొంతుకులపై రెడ్ బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇస్తున్న అరకొర సంక్షేమ పథకాలు అర్హత ఉండి కూడా అందుకోలేని లబ్ధిదారులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించే ధైర్యం చేయలేని దుస్థితి నెలకొందన్నారు. సోషల్ మీడియాలో కూటమి నేతలు వారి ఇష్టానుసారంగా పెడుతున్న పోస్టులకు వైఎస్సార్‌సీపీ నాయకులు కౌంటర్ ఇస్తున్న కేసులు బనాయిస్తుండడం విడ్డూరంగా ఉందన్నారు. కూటమి పాలనలో అన్యాయంగా అక్రమంగా కేసులకు గురవుతున్న బాధితులకు అండగా నిలబడడానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ యాప్‌ను ఆవిష్కరించారని తెలిపారు. ఎవరికి ఏ అన్యాయం జరిగినా ఈ యాప్‌లో నమోదు చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి రాబోతుందని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు యడ్ల తాతాజీ, యినకొండ రవి, కర్రా జయసరిత, మద్దా చంద్రకళ, కోరాడ శ్రీనివాసరావు, పెన్మెత్స ఏసురాజు, ఉచ్చుల స్టాలిన్, బండి రమేష్, మానుకొండ శ్రీనుబాబు, జోగాడ ఉమామహేశ్వరరావు, మామిడిశెట్టి చిట్టిబాబు, జోగి వెంకటేశ్వరరావు, వీరా మల్లికార్జునుడు, మోర్త గిరీష్, రాజేష్, నాగమణి, రాజామణి, పెదపాటి పెద్దిరాజు, పాలపర్తి కృపానాథ్, పీతాని మురళీ, పాలంకి శ్రీను, చెన్ను విజయ్, గేదెల నరసింహరావు, పిట్టా రాజ్‌కుమార్, కెల్లా పెద్దిరాజు, గుడాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

3న గ్రామ సభలు

పెనుగొండ: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉపాధి పనులు గుర్తించడానికి, ఉపాధి కార్మికులను గుర్తించడానికి ఆచంట మండలంలో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.కృష్ణమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామ సభలో పనులు గుర్తిస్తామని, మండలంలోని 12 గ్రామాల్లోనూ గ్రామ సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

ముగిసిన అధ్యాపకుల శిక్షణ


శిక్షణ పూర్తిచేసుకున్న అధ్యాపకులు

నరసాపురం రూరల్: నరసాపురం మండలం సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో వివిధ కళాశాలల అధ్యాపకులకు ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ బుధవారం ముగిసింది. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంతో అధ్యాపకులకు పలు విషయాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. రిటైర్డ్ అధ్యాపకులు సీఆర్ నాగేంద్ర బోధనా పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం కొండవీటి సత్యనారాయణ, త్రినాథ్, అడ్డాల శ్రీహరి, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గోపిచంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మెడికల్ క్యాంపులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఉప్పరగూడెం, కొమ్ముగూడెం గ్రామాల్లో బుధవారం స్వస్త్ నారీ – సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పరగూడెంలో 164మందికి, కొమ్ముగూడెంలో 220మంది రోగులకు పరీక్షలు చేశారు. మహిళల ఆరోగ్యానికి తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషకాల గురించి ఆరోగ్య సిబ్బంది వివరించారు. ఎంఎల్‌హెచ్‌పీలు వి.రూత్, ఎం. మౌనిక, రామతారకం, ఏఎన్ఎం టి.విజయ, మహంకాళి, కే.ధనలక్ష్మి, వీరపాప, ఆశాలు ఎం.చంద్రకాంతం, డి.రామతులసి, ఎ. వెంకటలక్ష్మి, కే.ప్రశాంతి, అంగన్‌వాడీ సిబ్బంది ఎం.రజీనా బీబీ, కనకలత, డి.ప్రభారాణి, సీహెచ్.శాంతికుమారి పాల్గొన్నారు.

డ్రెయినేజీని పునర్నిర్మించాలి

తణుకు అర్బన్: తణుకు మండలం వేల్పూరు గ్రామం 10వ వార్డులోని సాలిపేటలో శిథిలావస్థకు చేరిన డ్రెయినేజీని పునః నిర్మాణం చేపట్టాలని సీపీఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ళ చిన వీరభద్రరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సీపీఎం వేల్పూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కోరుతూ ఇంటింటికి తిరిగి సంతకాల సేకరణ చేశారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలోని బిల్లు కలెక్టర్ కోలా శ్రీనివాస్‌కు ప్రజల నుంచి సేకరించిన సంతకాలతో కూడిన వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వీరభద్రం మాట్లాడుతూ డ్రెయినేజీలో ప్రజలు వాడిన వాడకం నీరు పారుదల లేక మురుగునీరు నిల్వ ఉండిపోయి తీవ్రమైన దుర్వాసన వస్తుందని స్పష్టం చేశారు. దీంతో దోమల బెడద అధికంగా ఉండటంతో విష జ్వరాలు, మలేరియా వంటి రోగాలు వ్యాపించి ఆ ప్రాంత ప్రజలు తీవ్రమైన అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం నెలకొందని అన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకూ లబ్ధి

పెంటపాడు: జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకూ లబ్ధి చేకూరుతుందని ప్రతిపాడు గ్రామ కార్యదర్శి జవ్వాది నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చెరుకూరి సోమశేఖర్, ఆరాధ్యుల అంజి, మట్టా రాంబాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.